క్లుప్తంగా...

నేడు ఉచిత వైద్య శిబిరం

కుషాయిగూడ: మధుర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కుషాయిగూడలోని గోపి మెమోరియల్ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్టు ఫౌండర్, కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కిమ్స్ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేస్తున్న మెగా వైద్య శిబిరంలో అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా



చిలుకానగర్ మల్లికార్జున నగర్‌లో పైపులైన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత, అధికారులు

ఉప్పల్: డివిజన్‌లో అన్ని ప్రాంతాలకు నీరు అందించేలా కృషి చేస్తున్నట్లు చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. శనివారం మల్లికార్జున నగర్ రోడ్ నంబర్–3లో జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. త్వరతగతిన నీటి పైపు లైన్ పనులను పూర్తి చేసి రోడ్లను పునరుద్ధరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో డీఈ నిఖిల్‌రెడ్డి, జలమండలి అధికారి రజినీ కాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



అల్వాల్: లయన్స్ క్లబ్ ఆఫ్ అల్వాల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అల్వాల్ బాలాజీ ఆలయ ఆవరణలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన వైద్య శిబిరంలో జనరల్, దంత పరీక్షలతోపాటు కంటి పరీక్షలు నిర్వహించారు. అర్హులైన వారికి కంటి అద్దాల కూడా అందజేస్తామని తెలిపారు.

ఆర్‌సీసీ పైపులైన్ పనులు ప్రారంభం



మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో రూ.30 లక్షలతో చేపట్టిన ఆర్‌సీసీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఓపెన్ నాలాల స్థానంలో యూజీడీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సత్యమూర్తి, బాబు, సంపత్, బ్రహ్మయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఏసీపీ నరేష్‌రెడ్డి బదిలీ



ఉప్పల్: మల్కాజిగిరి ఏసీపీగా హెచ్‌ఆర్‌సీ డిపార్టుమెంట్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆకుల శ్రీనివాస్ నియమితులయ్యారు. మల్కాజిగిరి ఏసీపీగా పనిచేస్తున్న నరేష్‌రెడ్డి హెచ్‌ఆర్‌సీ డిపార్టుమెంట్ డీఎస్పీగా బదిలీపై వెళ్లారు. ఈ మేరకు శనివారం డీజీపీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఒత్తిడిని ఎదుర్కోవాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న వక్తలు

రామంతాపూర్: ఆత్మహత్యల నివారణ దినోత్సవంలో భాగంగా స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆత్మహత్యల నివారణకు చేపట్టాల్సిన పరిష్కారాల గురించి శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన వ్యక్తులు మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరికీ ఒత్తిడి ఉంటుందని, దాన్ని అధిగమించడానికి అనేక ఉపాయాలు ఉన్నాయని, అందులో భాగంగా యోగా మెడిటేషన్ వాకింగ్ వంటి వ్యాయామాలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వినయ్ కుమార్, ఆర్కే నాయుడు, కృష్ణారావు, వాగ్దేవు గీతా ప్రియా, డాక్టర్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న వ్యాధులు

జిల్లాలో పెద్దఎత్తున ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో దోమల స్వైరవిహారంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. జిల్లాలో సుమారు 40 లక్షల జనాభా ఉండగా, మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు మూడు ఏరియా ఆస్పత్రులు, 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 28 యూపీహెచ్‌సీలు, 103 బస్తీ దవాఖానాలకు నిత్యం జ్వర లక్షణాలతో వైద్య సేవల కోసం వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో డెంగీ కేసులు 305 నమోదయ్యాయి. పలు ఆస్పత్రుల్లో రోగుల కోసం ప్రత్యేక పడకలను ఏర్పాటు చేశారు. –సాక్షి, మేడ్చల్ జిల్లా

- దోమల స్వైరవిహారంతో వ్యాధుల వ్యాప్తి
- జ్వర లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరుతున్న ప్రజలు
- మేడ్చల్ జిల్లాలో 305 డెంగీ కేసుల నమోదు
- ఆయా ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ చర్యలు



డెంగీ కేసులు ఎక్కువగా నమోదు

జిల్లాలో గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే, పట్టణ ప్రాంతంలోనే డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. మురికివాడలు, పారిశ్రామిక ప్రాంతాలైన బాలానగర్, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, జగద్గిరిగుట్ట, సూరారం కాలనీ, గుండ్లపోచంపల్లి, కూకట్‌పల్లిలోని ఎల్లమ్మబండ, ఉప్పల్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నారపల్లి, జవహర్‌నగర్, చర్లపల్లి పారిశ్రామిక వాడలు, మల్కాజిగిరిలోని కొన్ని ప్రాంతాల్లో డెంగీ కేసులు ఎక్కువగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో చిన్నా, పెద్ద పరిశ్రమలతో పాటు ఉపాధి మెండుగా ఉండటంతో వలస వచ్చిన ప్రజలు కూడా అధికంగా నివస్తున్నారు.

వ్యాధులు ప్రబలడానికి..

జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతం ఉండటంతో పాటు కూకట్‌పల్లి, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లలో బస్తీలతో పాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడ్చల్ మున్సిపల్ పట్టణాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారంతో దోమలు స్వైర్వవిహారం చేస్తున్నాయి. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలతో పొగ వెదజల్లక పోవడంతో ప్రజలు రోగాలకు గురవుతున్నారు. ఈ బస్తీల్లో అభివృద్ధి పర్యవేక్షణ కమిషనర్లదే అయినప్పటికీ.. పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రైవేటు ప్లాట్లలో పెరిగిన చెట్లు, ముళ్ల పొదల్లో వ్యర్థాలు చేరినప్పటికీ పట్టించుకోకపోవడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. చెరువులన్నీ మురుగు కూపాలుగా మారడంతో.. దోమలకు ఆవాసాలుగా మారాయి.

స్థానిక సంస్థల పాత్ర..

పురపాలికలు, పంచాయతీ సిబ్బంది వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉంది. డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలినప్పుడు మాత్రమే రసాయనాలు పిచికారీ చేస్తున్నారు. నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్, దోమల నివారణకు గంబూసియా చేపలను వదలాల్సి ఉంది. గ్రామాల్లో నీటి కుంటలు, ఇక పరిసరాల్లో నీరు నిల్వకుండా ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలి. నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి. గ్రామాల్లో చెత్త తరలింపు, దోమల లార్వాలు వృద్ధి చెందకుండా నియంత్రించాలి.

వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు

వైద్య ఆరోగ్యశాఖలో కీటక జనిత వ్యాధుల నివారణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధుల నివారణకు గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నారు. వ్యాధులు ప్రబలిన ప్రదేశాల్లో ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా చికిత్స అందిస్తూనే ఇంటింటి సర్వే చేసి బాధితులను గుర్తిస్తున్నారు. అన్ని ఆస్పత్రుల్లో మందులు, వ్యాధుల నివారణకు టీహబ్ ద్వారా రక్త నమూనాలు సేకరిస్తున్నారు. ఫలితాలు రాగానే వైద్య సేవలు అందిస్తున్నారు.

ప్రజలు మేల్కోవాల్సిందే..

వ్యాధుల నివారణకు అధికార యంత్రాంగంతో పాటు ప్రజలు బాధ్యతతో వ్యవహరిస్తేనే నివారణ సాధ్యమవుతుంది. బహిరంగ ప్రదేశాల్లో పుర, వైద్య అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టినా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలి. ఇంట్లో లేదా పరిసరాల్లో వారం రోజులు మించి నీరు నిల్వ ఉండకుండా చూడాలి. టైర్లు, కొబ్బరి బొండాలు, ఖాళీ డబ్బాలు, పాత కూలర్లు, ఇతర వస్తువులు ఇంటి ఆవరణలో ఉంటే వర్షపు నీరు నిల్వకుండా చూడాలి.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ప్రత్యేక చర్యలు

జ్వరాల నివారణకు జిల్లాలో అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపడుతున్నాం. జ్వర పీడితులకు రక్తపరీక్షలు, చికిత్స నిమిత్తం అన్ని మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జ్వర పీడితులకు ప్రత్యేక వార్డులున్నాయి. అన్ని ప్రాథమిక ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా సేవలు అందిస్తున్నాం. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అవగాహనతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.

– డాక్టరు పుట్ల శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖధికారి

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

బోడుప్పల్: విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీల ఎంపిక ప్రక్రియలో భాగంగా చెంగిచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొనగా కబడ్డీ అండర్–14 విభాగంలో 8, 9వ తరగతులకు చెందిన సంధ్య, ఉదయ్‌తేజ్, అండర్–17 విభాగంలో 10వ తరగతికి చెందిన కావ్య ఎన్నికయ్యారు. ఖోఖో అండర్–14 విభాగంలో ఉదయ్ తేజ్, శ్రీరామ్, అనుశ్రీ, అండర్–17 విభాగంలో శ్రీచరణ్, లోకేశ్వరి ఎంపిక కాగా వారిని శనివారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, పీఈటీ భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి




సీసీ రోడ్డు పనుల శంకుస్థాపనలో మేయర్ సామల బుచ్చిరెడ్డి

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. రాజలింగం కాలనీలో రూ.7.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా అన్ని డివిజన్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్ ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మగౌడ్, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఐలమ్మ జయంతి వేడుకల కమిటీ వైస్ చైర్మన్‌గా ఆలేటి

కుషాయిగూడ: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే చాకలి ఐలమ్మ జయంతి వేడుకల కమిటీ వైస్ చైర్మన్‌గా ఆలేటి రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు అధికారులు శనివారం నియామకపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ తనకు కమిటీలో అవకాశం కల్పించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తన సంపూర్ణ సహకారం అందజేసి వేడుకలు ఘనంగా జరిగేలా తోడ్పాటు అందిస్తానన్నారు.

నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్‌గా శివకుమార్



అల్వాల్: నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్‌గా ఏ.శివకుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న శివకుమార్‌ను నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా, నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జి.నాగరాజును స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేస్తున్న శుక్రవారం రాచకొండ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సాహిత్యంపై పట్టుసాధిస్తే అద్భుత రచనలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత కెవిన్ మిస్సల్

మల్లాపూర్: విద్యార్థులు సాహిత్యంపై పట్టు సాధిస్తే అద్భుత రచనలు, వ్యాసాలు, కథలు రాయవచ్చని ప్రముఖ రచయిత కెవిన్ మిస్సల్ అన్నారు. మల్లాపూర్ జాన్సన్ గ్రామర్ స్కూల్లో నిర్వహించిన సాహిత్య మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జాన్సన్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు రాసిన కవితలను పుస్తక రూపంలో ప్రచురించిన క్రియేటివ్ ఎండివర్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. 100 మంది విద్యార్థులు, వ్యాసాలు, కథలు, పద్యాలు, వ్యాస రచన పోటీలో పాల్గొన్నారు. విద్యార్థుల నృత్యాలు, పుస్తకాల ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. జాన్సన్ గ్రామర్ స్కూల్ అడ్మినిస్ట్రేటర్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ స్రబంతి బసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే



కుషాయిగూడ: కుషాయిగూడలోని నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అమ్మమ్మ, తాతయ్యాలు, నానమ్మలతో పాఠశాలకు కలిసి వచ్చి సందడి చేశారు. అమ్మ.. నాన్నల ప్రేమతో పాటు గ్రాండ్ పేరెంట్స్ వారిపై చూపే ప్రేమ, అప్యాయత, అనురాగాలను చిన్నారులకు తెలియజేసేందుకే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ అపరంజిని తెలిపారు. అనంతరం గ్రాండ్ పేరెంట్స్ చిన్నారులకు దీవెనలు అందజేశారు. ఏజీఎం పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ టెక్నిషియన్స్ సేవలు భేష్

ఎమ్మెల్యే ముఠా గోపాల్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

రామంతాపూర్: ఇందిరానగర్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నిషియన్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రముఖ ఎలక్ట్రికల్ శాస్త్రవేత్త మైకేల్ పారడై జయంతికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై నివాళులర్పించారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నిషియన్స్ అందరికీ ప్రమాద బీమా వర్తించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎలక్ట్రికల్ టెక్నిషియన్ సంఘం అధ్యక్షుడు రఘు, గ్రేటర్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌తో పాటు ప్రసాద్, చంద్రశేఖర్, సిద్ధూ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు మేడ్చల్ ప్రజావాణి రద్దు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 25న(సోమవారం) తాత్కాలికంగా రద్దు చేసినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజున జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఎన్నికల కమిషన్ వీడియో కాన్ఫరెన్స్ ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రజావాణి రద్దు విషయాన్ని గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.

బీఆర్‌ఎస్ టికెట్ స్థానికులకే ఇవ్వాలి



లక్ష్మీసాయి గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులు, ఉద్యమకారులు

- భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని నినాదాలు
- బీఆర్‌ఎస్ శ్రేణులు, ఉద్యమకారుల సమావేశం
- ముక్తకంఠంలో నేతలు, ఉద్యమకారుల తీర్మానం

గౌతంనగర్: మల్కాజిగిరి అసెంబ్లీ బీఆర్‌ఎస్ టికెట్‌ను స్థానికులకే ఇవ్వాలని మల్కాజిగిరికి చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు, మాజీ కార్పొరేటర్లు, ఉద్యమకారులు అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి తాము పార్టీలో ఉంటూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం అహర్నిశలు కృషి చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయడంతో పార్టీ శ్రేణులు అయోమయానికి గురికావొద్దని బీఆర్‌ఎస్ మల్కాజిగిరి ఇన్‌చార్జి బద్దం పరుశురాంరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమకారుడు సయ్యద్ ఖలీల్ అధ్యక్షతన శనివారం మల్కాజిగిరిలోని లక్ష్మీసాయి గార్డెన్‌లో పార్టీ శ్రేణులు భారీ ఎత్తున సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు వారి అభిప్రాయాలను తెలిపారు. మల్కాజిగిరిలో ఉండే స్థానికులకే టికెట్ కేటాయించాలని ముక్త కంఠంతో తమ అభిప్రాయాలకు వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత బీఆర్‌ఎస్ నుంచి అల్వాల్‌కు చెందిన చింతల కనకారెడ్డికి పార్టీ టికెట్ కేటాయిస్తే ఆయన గెలుపు కోసం సమష్టిగా కృషిచేసి గెలుపించుకున్నామన్నారు. అనంతరం 2018లో మైనంపల్లి హన్మంతరావుకు పార్టీ అధిష్టానం టికెట్ ఇస్తే ఆయన గెలుపుకోసం కృషి చేశామన్నారు.

కష్టపడి భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం..

మైనంపల్లి హన్మంతరావు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయడంతో స్థానికేతరులకు టికెట్ కేటాయిస్తారని వార్తలు వస్తున్నాయని, దాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. పార్టీని నమ్ముకొని మల్కాజిగిరిలో ఉంటున్న స్థానికులు ఎవరికైనా టికెట్ కేటాయిస్తే తామంతా కష్టపడి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆర్.శిరీషారెడ్డి, బద్దం పుష్పలతారెడ్డి, నాయకులు ఆర్, జితేందర్‌రెడ్డి, జవహర్‌నగర్ కార్పొరేటర్ ఏకే. మురుగేష్, నాయకులు వెంకన్న, సురేష్, సిద్ధి రాములు, ఉస్మాన్, క్రిష్ణమూర్తి, భాగ్యానందరావు, శ్రీదేవి, శేఖర్‌గౌడ్, క్రిష్ణగౌడ్, లక్ష్మణ్‌రావు తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ టికెట్ కోసం సమావేశాలు



అల్వాల్‌లో సమావేశమైన అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి



అల్వాల్‌లో మాట్లాడుతున్న ఉద్యమ నాయకుడు డిల్లీ పరమేష్

అల్వాల్: సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయడంతో మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ టికెట్ కోసం పలువురు నాయకులు, ఉద్యమకారులు తమకే కేటాయించాలని కోరుతూ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్ల నాయకులు సమావేశం ఏర్పాటు చేసుకొని స్థానికులకే అవకాశం కల్పించాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు. అల్వాల్ సర్కిల్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి కోడలు, కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి తన నివాసంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఉద్యమ నాయకుడు పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న డిల్లీ పరమేష్ తనకు అవకాశం కల్పించాలని అల్వాల్ ఈ సేవ సర్కిల్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద విజ్ఞప్తి చేశారు. ఒకటి రెండు రోజుల్లో బీఆర్‌ఎస్ అధిష్టానం మల్కాజిగిరి నియోజకవర్గానికి పార్టీ సమన్వయం చేయడానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది.

డాక్టర్ సోహన్‌సింగ్‌కు నివాళి



రామంతాపూర్: ప్రముఖ హోమియోపతి వైద్యుడు డాక్టర్ సోహన్‌సింగ్(76) శనివారం ఉదయం బంజారాహిల్స్‌లోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన గతంలో రామంతాపూర్ ప్రభుత్వ హోమియో ఆస్పత్రిలో మెడికల్ కళాశాలకు వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆయుర్వేద డైరెక్టర్ రామంతాపూర్ ప్రభుత్వ హోమియో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజుతో పాటు పలువురు సంతాపం తెలిపారు.

శ్రీకృష్ణుడిగా.. శ్రీనివాసుడు..



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్‌ను శ్రీకృష్ణుడి అవతారంలో అలంకరించి అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మేడిపల్లి: అంగన్‌వాడీ హెల్పర్స్, టీచర్స్ సమస్యను వెంటనే పరిష్కరించాలని పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి రచ్చ కిషన్ అన్నారు. మేడిపల్లి మండల తహసీల్దార్ ఆఫీస్ వద్ద చేపట్టిన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ నిరవధిక సమ్మెకు వారు మద్దతు తెలిపారు. అనంతరం నిర్వహించిన మానవహారంలో పాల్గొన్నారు. నేతలు జంగాచారి, సోమయ్య, ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి, కోశాధికారి ప్యారి జాన్, సుచిత్ర, సులోచన పాల్గొన్నారు.

పార్వతీ తనయ నమోస్తుతే..



ఉప్పల్ సర్కిల్ పరిధిలో వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ వినాయకుడి పూజల్లో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



మేడిపల్లి కమలానగర్ కాలనీలోని శ్రీసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో..



రామచంద్ర ఎన్‌క్లేవ్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్